క్లుప్తంగా

ఘనంగా పీవీ జయంతి



నివాళులర్పిస్తున్న చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

నిర్మల్‌టౌన్: మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని శాంతినగర్ చౌరస్తాలో గల పీవీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిల్ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు కొండా సబితా–శ్రీధర్, రామగోని తులసి నర్సాగౌడ్, అన్వర్ పాషా, కోఆప్షన్ మెంబర్ చిలుక గోవర్ధన్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

సారంగపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను రూరల్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ జూలై 1 నుంచి నూతన చట్టాలు అమల్లోకి రానున్న నేపథ్యంలో సిబ్బంది వాటిపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సై శ్రీకాంత్‌ను ఆదేశించారు. అదేవిధంగా తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో సిర్పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జామ్ గ్రామంలో గ్రామసభ

సారంగపూర్: మండలంలోని జామ్ పంచాయతీలో ప్రత్యేకాధికారి లక్ష్మీకాంత్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు, వర్షాకాలంలో వ్యాధుల తీవ్రత, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ప్రత్యేకాధికారి మాట్లాడుతూ పంచాయతీ నిధులతో వీధి దీపాల ఏర్పాటు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం తదితర పనులు చేపట్టాలని కార్యదర్శి అశోక్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కారోబార్ సురేశ్, పంచాయతీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు సునీత, రాధ ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం,

కుంటాల: రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. కుంటాల సహకార సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగిలో 83,982 వరి ధాన్యం బస్తాలు, 52,767 జొన్న బస్తాలు రైతుల వద్ద కొనుగోలు చేశామన్నారు. ధాన్యం డబ్బులు సకాలంలో వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, సీఈవో నాగభూషణం, అసిస్టెంట్ సీఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, భోజంధర్, డైరెక్టర్లు నారాయణరావు పటేల్, ప్రణయ్‌రావు, గోనె గజ్జారాం, పాండు, రాందాస్, పురుషోత్తం, శివ్‌రాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

లక్ష్మణచాంద: నర్సరీలలోని మొక్కలను సంరక్షించాలని జెడ్పీ సీఈవో గోవింద్‌రావు పేర్కొన్నారు. మండలంలోని వడ్యాల్, రాచాపూర్, పొట్టపెల్లి(కే) గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీఏ దినేశ్, ఎఫ్ఏ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శి రమ్య పేర్కొన్నారు. హరితహారంలో భాగంగా అందకూర్‌లో శుక్రవారం ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఎఫ్ఏ భోజన్న, అంగన్‌వాడీ టీచర్ విమల, వీవోఏలు ఏసురత్నం, లావణ్య, ఆశాకార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్లె రోడ్లకు మహర్దశ

- ఐదు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు
- రూ.8 కోట్ల నిధులు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం



బీటీ రోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు(ఫైల్)

కడెం: మండలంలోని మారుమూల గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా కడెం మండలంలోని 4 గ్రామాలు, దస్తురాబాద్ మండలంలో ఒకటి చొప్పున బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఇటీవల బీటీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు త్వరలో పనులు ప్రారంభించనున్నారు. సారంగపూర్ నుంచి దిల్దార్‌నగర్ వరకు రూ.2.45 కోట్ల వ్యయంతో 3.50 కి.మీ, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నవబ్‌పేట్ వరకు రూ.80 లక్షల వ్యయంతో 1.20 కి.మీ, ధర్మాజీపేట్ నుంచి పాత రేవోజీపేట్ వరకు రూ.2.50 కోట్లతో 3.60 కి.మీ, చిట్యాల్ నుంచి నర్సింగాపూర్ వరకు రూ.1.40 కోట్లతో 2.0 కి.మీ, దస్తురాబాద్ మండల కేంద్రం నుంచి కొత్తగూడెం, వయా ఆశ్రమ స్కూల్, కేజీబీవీ వరకు రూ.కోటి వ్యయంతో 1.40 కి.మీ బీటీ రోడ్ల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దీంతో గ్రామాల ప్రజలకు దారి కష్టాలు తొలగనున్నాయి.

ఏళ్లనాటి కల



మా గ్రామానికి బీటీ రోడ్డు కావాలనేది ఏళ్ల నాటి కల. సరైన రోడ్డు లేక వానాకాలంలో బురద రోడ్డుతో ఇబ్బంది పడ్డాం. మెయిన్ రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ నిర్మాణంతో దారి కష్టాలు తీరుతాయి.

– జుట్టు వెంకటేశ్, నవాబ్‌పేట్

త్వరలో పనులు ప్రారంభం

కడెం మండలంలో నాలుగు, దస్తురాబాద్ మండలంలో ఒక బీటీ రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవలే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమిపూజ చేశారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

– మల్లారెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ

ఆలయాల్లో శిఖరస్థాపన



శిఖర స్థాపన చేస్తున్న గ్రామస్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

కుభీర్: మండలంలోని చొండి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, సాయిబాబా మందిరాలకు శుక్రవారం శిఖర స్థాపన చేశారు. ఉదయం శిఖరాలతో గ్రామస్తులు శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ పాల్గొని పూజలు చేశారు. ఆడపడుచులకు గ్రామస్తులు కానుకలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బోయిడి విఠల్, మాజీ ఎంపీటీసీలు మోహన్, రాందాస్, శంకర్, జాదవ్, వసంత్, మాజీ సర్పంచ్ చంద్రకాంత్, బీజేపీ నాయకులు వడ్నం నాగేశ్, కనకయ్య, లక్ష్మణ్, సాయినాథ్, సంతోష్ ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



గంగయ్య (ఫైల్)

నర్సాపూర్(జి): అప్పుల బాధతో రైతు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. గొల్లమాడ గ్రామానికి చెందిన రైతు కోటగిరి గంగయ్య (50) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న మూడెకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేశాడు. వర్షం కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సాగు కోసం పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. భార్య సురేఖ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మురుగుకాల్వను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్



కుభీర్‌లో కుండీలో నీరు పారపోస్తున్న అధికారులు

- డీపీవో శ్రీనివాస్

లక్ష్మణచాంద: పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. ఫ్రైడే డ్రై డేలో భాగంగా మండలంలోని కనకాపూర్ గ్రామంలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల, గ్రామ వీధులను పరిశీలించారు. ఇళ్ల వద్ద నిల్వ నీటిని పారబోయించారు. పాఠశాలలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. దోమలు పెరగకుండా బైటెక్స్ పిచికారి చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. తన పర్యటన సమయంలో కార్యదర్శి రవీందర్ లేకపోవడంతో డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శులు సమయపాలన పాటించాలన్నారు. తహసీల్దార్ జానవి, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాందలో..

మండల కేంద్రంలోని ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పారబోశారు. ఇంటి చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సుగుణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కుభీర్: మండల కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. పంచాయతీ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు గ్రామంలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని అన్నారు. ఈవో విజయ్, ఏఎన్‌ఎం సరస్వతి, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు ఉన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలో ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బందికి శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వేదవ్యాస్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల గురించి వివరించారు. గ్రామాల్లో పాడైపోయిన టైర్లు, ఖాళీ అయిన కొబ్బరి బొండాల్లో, ప్లాస్టిక్ వ్యర్థాల్లో నీటిని తొలగించాలన్నారు. అనంతరం సారంగాపూర్‌లో సిబ్బందితో కలిసి డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నిలిచి ఉన్న నీటిని తొలగించడంతో పాటు డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ముధోల్: ముధోల్‌లో డ్రైడే పురస్కరించుకొని చెత్తాచెదారం తొలగించారు. నిల్వ నీటిని లేకుండా చూడాలని ఈవోపీఆర్‌డీ అమీర్‌ఖాన్ సూచించారు. పంచాయతీ ఈవో అనూష, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తంగా

ఉద్యోగ విరమణ హెచ్‌ఎంకు సన్మానం

కుంటాల: మండలంలోని ఓలా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుబ్బ లక్ష్మణ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. పనిచేసినచోట గుర్తింపు ఉండాలని హెచ్‌ఎం తనవంతుగా రూ.27 వేలు వెచ్చించి పాఠశాలకు కిటికీలు, పిల్లలకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఉపాధ్యాయులు రాజేష్ కుమార్, శ్రీనివాసాచార్య, భరత్ కుమార్, రవీందర్, తాటి సోమేశ్వర్, కాలేవార్ రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నిరంజని, నాయకులు యూనిస్, కృష్ణ పాల్గొన్నారు.

సారంగపూర్: జామ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తించి ఈనెల 30న పదవీవిరమణ పొందనున్న తోకల నర్సమ్మను శుక్రవారం పాఠశాల సిబ్బంది సన్మానించారు. హెచ్‌ఎం జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సోన్: ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని హెచ్‌ఎం వెంకన్న కొనియాడారు. పాక్‌పట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వర్, సంజీవ్ ఇటీవల పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం సన్మానించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు రవికాంత్, కృష్ణారావు, చంద్రశేఖర్‌రావు, రవికాంత్, అరుణ, బలిరామ్, గోపిగౌడ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ఖానాపూర్: డాక్టర్ శ్యామ్‌ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానం

నిర్మల్‌టౌన్: నూతనంగా ఎన్నుకున్న రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్ష, జనరల్ సెక్రెటరీ కొండ్ర విజయ్‌కుమార్, సీఆర్ భీమ్ సింగ్‌ను హైదరాబాద్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాకాల రాంచందర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. జిల్లా జనరల్ సెక్రెటరీ సుదర్‌సింగ్ ఉన్నారు.

అక్రమ డీ1 పట్టాలు రద్దు చేయాలి

మామడ: న్యూసాంగ్వి శివారులో భూములు కబ్జా చేసేందుకు అక్రమంగా డీ1 పట్టాలు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. గ్రామస్తులు గంగాధర్, లింగన్న, రాజేందర్ ఉన్నారు.

పాన్‌షాప్‌ల తనిఖీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు పాన్ షాప్‌లను పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. నిషేధం ఉన్న గుట్కా, తదితర విక్రయించొద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఆర్ ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

పెద్ద చెరువు పరిశీలన

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువును అధికారులు శుక్రవారం పరిశీలించారు. చెరువు శిఖం భూమిలో సాగు చేస్తున్న వారిని గుర్తించి నోటీసులు అందిస్తామని నీటి పారుదలశాఖ డీఈ భోజదాసు తెలిపారు. గంగపుత్ర సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు పరిశీలించినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, ఏఈ గణేశ్, మండల సర్వేయర్ సంధ్య ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ముధోల్: మండలకేంద్రంలోని నయాబాది చౌరస్తా మధ్యలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ నివాసంలో ఆయన్ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు దేవోజీ భూమేష్, నాయకులు రమేష్, తదితరులు ఉన్నారు.

ఎంఐఎం కార్యాలయం ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలోని 25వ వార్డు పరిధిలో గల బంగాలగల్లిలో ఎంఐఎం పట్టణ కమిటీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్, ఎంఐఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఎండీ జాబీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు ఫైజుల్లాకాన్‌తో రిబ్బన్ కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు.

ఆడపిల్లలను చదివిద్దాం

లోకేశ్వరం: ఆడపిల్లలను బతకనిద్దాం గౌరవంగా చదివిద్దామని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తలకు పీసీపీఎన్‌డీటీ చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిర్మూలన, పోక్సో యాక్ట్ గురించి వివరించారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

ఖానాపూర్: మెదక్ జిల్లా ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా నాయకులు బేర తిరుమలేశ్, లింగాల అంజన్న, చింతలదాస్‌గౌడ్ ఉన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

కుంటాల: గ్రామాల్లో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని ఎస్సై వి.రజినీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(కే) గ్రామంలో కొత్త చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏఎస్సై దేవ్‌రావు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగనీళ్ల జాతర

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో గంగనీళ్ల జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల ఊరేగింపుతో వెళ్లి ముత్యాలమ్మ, మహాలక్ష్మి మందిరం వద్ద పూజలు చేపట్టారు. గోదావరి నది నుంచి జలాలు తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు కురవాలని, పంటలు పండాలని మొక్కు చెల్లించుకున్నారు. వీడీసీ చెర్మన్ ప్రవీణ్ ఉన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామంలో ఏఈవో తిరుపతి రైతులకు విత్తన శుద్ధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సోన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుకర్, పీసీసీ సభ్యుడు సుదర్శన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణమంతంలో శుక్రవారం పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500కే సిలిండర్, రుణమాఫీ వంటి వాటిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో పీఎస్‌సీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచులు మోహినొద్దీన్, సాయన్న, రాజనర్సింహారెడ్డి, వినోద్, గడ్డం స్వామి, లస్మన్న, ఈలసరం లింగన్న, అంబేకర్ ప్రసాద్, మేక ప్రేమ్, కాంతయ్య, రాజేశ్వర్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో

సోన్: స్థానిక రైతువేదికలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మానసరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివారు. ఎంఈవో శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, యూనిఫాంలు పంపిణీ చేశామన్నారు. 270 మంది విద్యార్థులను పాఠశాలల్లో ప్రవేశం కల్పించామన్నారు. ఏవో వసంత్‌రావు మాట్లాడుతూ మండలంలోని రైతుబంధు కింద రూ.7.62 కోట్లు జమచేశామన్నారు. 24 మందికి రైతుబీమా రూ.1.20 కోట్ల చెక్కులు అందించినట్లు తెలిపారు. జీలుగ విత్తనాలపై రూ.8.93 లక్షల సబ్సిడీ అందించినట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి వర్తించని ఎవరైన ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఈ శ్రీనివాస్ సూచించారు. పింఛన్ రావడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ మీటర్లు లేకపోవడం, తదితర వాటిపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎంపీవో ఖలీల్ హైమద్, వైస్ ఎంపీపీ అంకుల్ నాగయ్య, ఎంపీటీసీ రాజేశ్వర్, లింగవ్వ, పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాస్, మమత తదితరులు పాల్గొన్నారు.

విచారణ పారదర్శకంగా చేయాలి

ఖానాపూర్: ఐసీడీఎస్ కార్యాలయంలో వస్తున్న అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ పారదర్శకంగా చేపట్టాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నంది రామయ్య అన్నారు. స్థానిక అర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విచారణ పక్కదోవ పట్టకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగమణి, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ, ఖానాపూర్ సెక్టార్ అధ్యక్షురాలు మునీంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతి, జిల్లా కార్యదర్శి నర్సయ్య, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు శంభు, అంగన్‌వాడీ టీచర్ రాణి పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యేను కలిసిన మాజీ ఎమ్మెల్యే



ప్రసాదం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

బాసర: నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. బాసర మండల కీర్గుల్ (బి) తాజామాజీ సర్పంచ్ పెద్దకొండ్రు సుధాకర్‌రెడ్డి, బాల మల్కన్న యాదవ్ రాజారెడ్డి తదితరులున్నారు.

పాఠశాల సందర్శన



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కస్తూరి శంకర్ సందర్శించారు. బుధవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో శుక్రవారం పాఠశాలకు విచ్చేసి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తిని రుచి చూశారు. బియ్యాన్ని పరిశీలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నిర్వాహకులను హెచ్చరించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పిచ్చి మొక్కలు తొలగింపజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ డి రాజారెడ్డి

భైంసాటౌన్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ డి.రాజారెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం విజేతలకు సీఐ బహుమతులు అందజేశారు. ప్రముఖ ఛాతి వైద్య నిపుణులు ఎం.శ్రీకాంత్‌గౌడ్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ముష్కం ప్రసన్నరాణి, ప్రిన్సిపాల్ సాయినాథ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామ వీడీసీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సాయన్న, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా లింగారెడ్డి, సభ్యులుగా యశ్వంత్‌రావు, భోజన్న, పోశెట్టి, చిన్నారెడ్డి భూమన్న, సంగ రతన్, సాయికృష్ణ ఎన్నికయ్యారు. వీరిని గ్రామస్తులు సన్మానించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కడెం: మండలంలోని సారంగపూర్‌కు చెందిన నర్సయ్య(45) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. నర్సయ్య కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పుల కారణంగా బాధపడేవాడు. ఈక్రమంలో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని గోదావరి తీరాన గల మామిడి చెట్టుకు శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాగవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

ముథోల్: మండలకేంద్రంలోని నయాబాది సమీపాన ఉన్న పెట్రోల్‌బంక్ వద్ద శుక్రవారం బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. వ్యవసాయ పని నిమిత్తం మహారాష్ట్రలోని కొండల్‌వాడి గ్రామానికి చెందిన సాయికిరణ్ బైక్‌పై భైంసా వచ్చాడు. తిరుగుప్రయాణంలో అదుపు తప్పి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని భైంసా ఏరియాస్పత్రి నుంచి నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఆరుగురికి జైలు

కడెం: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఆరుగురికి 14 రోజుల జైలుశిక్ష విధిస్తూ ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నితీన్‌కుమార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం..మండలంలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన మహిళను ఈనెల 20న మండలంలోని హరిజనవాడకుచెందిన చింటు, ప్రభాకర్, ఆరికెల ప్రభాకర్, విద్యాసాగర్, దిల్దార్‌నగర్‌కు చెందిన మనోహర్, జగిత్యాల జిల్లా బోర్నపల్లికి చెందిన నాగరాజు అసభ్యంగా ప్రవర్తించారు. బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.